ప్రజాశక్తి





సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా అనంతపురంలోని ప్రధాన కూడళ్లలో సిపిఎం జెండాలను ఏర్పాటు చేస్తున్న ఆ పార్టీ నాయకులు



దీక్షా శిబిరం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

- ముగిసిన అంగన్‌వాడీల నిరసన
- రెండు రోజులుగా దీక్షా శిబిరంలోనే అంగన్‌వాడీలు
- సిపిఎంతో పాటు సిఐటియు, ప్రజాసంఘాల మద్దతు

36 గంటల నిరసన సక్సెస్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అపరిష్కృతంగానున్న సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 36గంటల నిరసన విజయవంతమైంది. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు నిరసన సాగింది. రాత్రి కూడా కలెక్టరేట్ ఎదుటనే వందలాది మంది అంగన్‌వాడీలు నిద్రించారు. వంటావార్పు కూడా అక్కడే చేసుకుని సాగిన ఈ నిరసన కార్యక్రమం మంగళవారం ముగిసింది. వేతన పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్లతో చేపట్టిన ఈ నిరసనకు సిపిఎం, సిఐటియు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, కెవిపిఎస్, ఆవాజ్ తదితర ప్రజా సంఘాలు పెద్దఎత్తున మద్దతు తెలిపాయి. అంగన్‌వాడీల 36 గంటల నిరసన కార్యక్రమం కొనసాగింపుగా రెండోరోజు మంగళవారం నాడు జరిగింది. ఉదయం దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేసిన నినాదాలు హోరెత్తాయి. ముగింపు సందర్భంలో కలెక్టరు గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు.

క్యాష్ పాలిటిక్స్ కాదు... క్లాస్ పాలిటిక్స్ కావాలి

వి.రాంభూపాల్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్నవి క్యాష్ పాలిటిక్స్ అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. ప్రజలకు కావాల్సింది క్లాస్ పాలిటిక్స్ అని చెప్పారు. అంగన్‌వాడీల నిరసనకు మద్దతు తెలిపిన తరువాత ఆయన మాట్లాడారు. మహిళలకు పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుస్తున్నట్టు ప్రభుత్వం చెబుతోందని గుర్తు చేశారు. అయితే ఇక్కడ రెండు రోజులుగా నిరసన చేపడుతున్న అంగన్‌వాడీలు మహిళలు కాదా అని ప్రశ్నించారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. ప్రతి దానిలోని పక్క రాష్ట్రమైన తెలంగాణాతో పోల్చుకునే ప్రభుత్వం వీరి వేతనాల్లో ఎందుకు పోల్చుకోవడం లేదని మండిపడ్డారు. అక్కడ ఇస్తున్న వేతనం రూ.13500 ఉందన్నారు. ఆ మేరకు వేతనాన్ని ఇక్కడా ఇవ్వాలన్న అంగన్‌వాడీల డిమాండ్‌లో న్యాయముందన్నారు. రిటైర్మెంట్ తరువాత గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోగా యాప్‌లు, ఇతర పేర్లతో అనేక రకాలుగా అంగన్‌వాడీలను ఇబ్బందులు పెట్టే విధానాలను ప్రభుత్వం అమలు జరుపుతోందని దుయ్యబట్టారు. ఈ విధానాలపై రాష్ట్రంలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీగానీ, అటు జనసేనగానీ పెదవి విప్పకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేకపోతే మరింత ఉధృతమైన పోరాటాలను, ప్రజాగ్రహాన్ని ప్రభుత్వం చవిచూడక తప్పదని హెచ్చరించారు.

మాట నిలుపుకోని మోడీ

ఓబులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు

2019 ఎన్నిలకకు ముందు 2018లో అంగన్‌వాడీల వేతనాలు



నిరసన దీక్షలో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

పెంచుతామని ప్రదానమంత్రి నరేంద్రమోడీ హామీనిచ్చారని, అయితే దానిని ఇప్పటికీ ప్రధాని ఆహామీని నిలుపుకోలేదని సిఐటియ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబుళు విమర్శించారు. మోడీ హామీ ఇచ్చిన మేరకు ఇప్పటికీ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా అంగన్‌వాడీల వేతనాలను తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఆమాటను ముఖ్యమంత్రి నిలుపుకోలేదని విమర్శించారు. ఒకవైపు నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. అందుకు తగ్గట్టు వేతనాల్లో పెరుగుదల లేదని పేర్కొన్నారు. పౌష్టికాహార లోపంతో బాధపడే వారికి సరైన పౌష్టికాహారం అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు కేటాయించే నిధుల్లోనూ కేంద్ర ప్రభుత్వం 30 శాతం కోత విధించిందని పేర్కొన్నారు. దేశంలో శిశు మరణాల సంఖ్య అధికంగా ఉంటున్న తరుణంలో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం సూచిస్తోందన్నారు. కాని ఈ పాలకులకు కేంద్రాల నిర్వహణపైగానీ, ఇందులో పనిచేసే సిబ్బంది సంక్షేమం గురించి ఏ మత్రం పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. అందుకే పోరాటాలతోనే ఈ సమస్యలను పరిష్కరించుకోగలమని చెప్పారు. ప్రభుత్వాలు దిగిరాకపోతే తగిన రితీలో బుద్ధిచెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అంగన్‌వాడీలకు సిపిఎం నగర కమిటీ మద్దతు

అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన 36 గంటల నిరసన దీక్షకు సిపిఎం నగర కమిటీ మద్దతు తెలిపింది. వీరికి మద్దతు నగరంలో బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శిబిరం వద్దకొచ్చి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనంతపురం మొదటి, రెండో కమిటీ కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, ఆవాజ్ నాయకులు వలి, బాబు, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. నిరసన దీక్షలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతల, ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ.నల్లప్ప, సిఐటియు నాయకులు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు



జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలో స్కూటర్ ర్యాలీలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నాయి. మూడు రోజుల పాటు అనంతపురం తపోవనం సర్కిల్‌లోని జిపిఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశాలు జరగనున్నాయి. 12వ తేదీ రాష్ట్ర కార్యదర్శివర్గం, 13, 14న రాష్ట్ర కమిటీ సభ్యులు ఇందులో పాల్గొంటారు. 12వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు జెడ్పీ హాల్లో 'వెనుకబడిన ప్రాంతాల అభివద్ధి- కేరళ ప్రభుత్వ నమూనా' అనే అంశంపై కేరళ మాజీ మంత్రి ఎంఎ.బేబితో చర్చావేదిక జరగనుంది. 13వ తేదీ సాయంత్రం 5 గంటలకు మున్సిపల్ ఆఫీస్ సర్కిల్ వద్ద బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఇందులో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్‌ఎ ఎంఎ.గఫూర్ పాల్గొని ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూర్తి చేశారు.

సమావేశాలను జయప్రదం చేయాలని స్కూటర్ ర్యాలీలు

అనంతపరంలో మూడు రోజల పాటు నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీలు నిర్వహించారు. అనంతపురం సిపిఎం నగర 1,2వ కమిటీల ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీని నిర్వహించారు. ఇందిరానగర్‌లోని గణేనాయక్ భవన్ సిపిఎం కార్యాలయం నుంచి ప్రారంభమైన స్కూటర్ ర్యాలీ తపోవనం సర్కిల్, రుద్రంపేట సర్కిల్, సప్తగిరి సర్కిల్, శ్రీ కంఠం సర్కిల్, పాతూరు మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం నగర 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ 12, 13, 14వ తేదీల్లో సమావేశాలకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, కేరళ మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ.బేబీ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ రాజ్యసభ సభ్యులు మధు, మాజీ ఎమ్మెల్యే గఫూర్, తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చ జరుగుతుందన్నారు. భవిష్యత్తు పోరాటాలకు దిశానిర్దేశం చేస్తారన్నారు. సమావేశాల సందర్భంగా 12న నిర్వహించే చర్చావేదిక, 13న జరిగే బహిరంగ సభల్లో మేధావులు, విద్యార్థులు, మహిళలు, రైతులు, కార్మికులు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ముస్కిన్, వలి, ప్రకాష్, ఉప సర్పంచ్ మసూద్, సిపిఎం నగర 2వ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, ముత్తుజ, ఎటిఎం నాగరాజు, నగర కమిటీ సభ్యులు బాబు, వెంకటేష్, జీవా, ప్రసాద్, రాజు, రామాంజనేయులు, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, ఎర్రిస్వామి, అభ్యుదయ కాలనీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నగర కమిటీల నాయకులు



కేతిరెడ్డి పెద్దారెడ్డి

ఎవరి కోసం సంపాదిస్తున్నాడో..

అది లేకుండా పోతుంది..!

జగన్మోహన్‌రెడ్డి కాళ్లు పట్టుకుంటే జెసి కొడుకును ఎమ్మెల్యే చేస్తా

జెసి.ప్రభాకర్‌రెడ్డిపై ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఫైర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'మా అన్నను చేసినట్టు చేయాలని ఊహించినా... ఎవరి కోసం సంపాదిస్తున్నాడో అది లేకుండా పోతుంది' అని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డిని ఉద్దేశించి వార్నింగ్ ఇచ్చారు. గడిచిన నాలుగైదు రోజులుగా వరుసగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. సోమవారం నాడు జెసి.ప్రభాకర్‌రెడ్డి మీడియా సమావేశం పెట్టి కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కుటుంబపైనా ఆరోపణలు చేశారు. దీనిపై మంగళారం నాడు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఘాటుగా స్పందించారు. అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలబీమా ఏ రకంగా వస్తుందన్న విషయం కూడా జెసి.ప్రభాకర్‌రెడ్డికి తెలిసినట్టు లేదని అన్నారు. బీమాలో ఎంత వయసు చెట్లకు బీమా ఇవ్వాలన్న నిబంధనేదీ లేదన్నారు. దాన్ని పట్టుకుని ఏవేవో ఆరోపణలను జెసి.ప్రభాకర్‌రెడ్డి చేస్తున్నాడని విమర్శించారు. ఆయన మాటలను ప్రజలెవరూ వినే పరిస్థితి లేదని చెప్పారు. రాజకీయాల్లో తానుఎంతో గొప్ప అని చెప్పుకునే జెసి కుటుంబం ఆయనకంటే చిన్న వాడైన నారా లోకేశ్ కాళ్లు పట్టుకుని టిక్కెట్టు అడుక్కునే పరిస్థితి వచ్చిందన్నారు. 2024లోనూ నీవు గెలవలేవని చెప్పారు. ఆ గెలుపు తరువాత నీవు పాడెనెక్కుతావో... నేను ఎక్కుతానో చూపిస్తానని హెచ్చరించారు. తెలంగాణలో దొంగతనాలు, దోపిడీలు చేస్తే తరిమేస్తే వచ్చినది మీ కుటుంబమని, అటువంటి వ్యక్తి తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదం అన్నారు. లిక్కరు కేసులు తనపైనున్నవి ఆయన పెట్టించిన దొంగ కేసులేనని చెప్పారు. ఆయనపై కూడా రెండు కేసులున్నాయని గుర్తు చేశారు. ఇలాగే వ్యవహరిస్తే ఆయన కుటుంబ చరిత్రను బయట పెడతానని హెచ్చరించారు. నేను జైళ్లోనున్న సమయంలో మా అన్నను హత్య చేసి మంత్రి పదవిని అడ్డంపెట్టుకుని కేసు నీరుగార్చారని చెప్పారు. దాన్ని చూసుకుని తిరిగి ఏదైనా చేయాలని ఊహించినా ఊరుకునేది లేదని మండిపడ్డారు. ఆ రకంగా ఊహించినా 'నీవు ఎవరి కోసం సంపాదించాలని అనుకుంటున్నావో... అది లేకుండాపోతుంది' జాగ్రత్త అని పెద్దారెడ్డి హెచ్చరించడం చర్చనీయాంశమవుతోంది.

పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

కరోనాతోపాటు 2022లో వర్షాకాలంలో పట్టణంలోని ప్రధాన మురికి కాలువల్లో మట్టి పూడికతీత కోసం పని చేసిన 25 మంది కార్మికులను తక్షణమే ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికుల చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 9వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా రాయదుర్గానికి వచ్చిన డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన డిప్యూటీ కలెక్టర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, కార్మికులు పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన సిఐటియు దీక్షలు



డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు



మాట్లాడుతున్న మంత్రి ఉషాశ్రీచరణ్

పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

మంత్రి ఉషాశ్రీచరణ్

కళ్యాణదుర్గం : జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని మంత్రి ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌కు మహిళలంటే గౌరవం లేదన్నారు. అందుకే వారిపట్ల అసభ్యంగా మాట్లాడుతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరవేస్తున్న వలంటీర్లను చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా జగనన్న పథకాలు అందజేస్తున్నారన్నారు. దీన్ని చూసి తట్టుకోలేక పవన్ పిచ్చివాడిలా మాట్లాడుతున్నారన్నారు. వెంటనే వాలంటీర్లు, మహిళలకు బేషరుతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే మహిళల ఆవేశానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

రైతుల ఇకెవైసి పూర్తి చేయండి

ఎడిఎ వెంకటరాముడు, ఎఒ అన్వేష్‌కుమార్

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలో పిఎం కిసాన్‌కు పెండింగ్‌లో ఉన్న రైతుల ఇకెవైసి పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ గుత్తి ఎడిఎ వెంకటరాముడు, ఎఒ అన్వేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల వ్యాప్తంగా రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి ఇకెవైసిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ ఉన్న పిఎం కిసాన్ ఇకెవైసి పూర్తి చేయాలని సూచించారు. లేకపోతే రైతులకు డబ్బులు జమ కావన్నారు. అలాగే ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో కౌలు రైతులకు అవగాహన కల్పించి కౌలు రైతుల కార్డులు మంజూరు చేయాలని కోరారు. తద్వారా కౌలు రైతులకు కూడా రైతు భరోసా వస్తుందన్నారు. కాగా మట్టి నమూనా పరీక్షలకు సంబంధించి అవగాహన కల్పించారు. తర్వాత మండలంలోని చక్రాయపేటలో ఉన్న స్వర్ణభూమి ఎరువుల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి, స్టాకు వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ అక్కమ్మ, వ్యవసాయ సిబ్బంది ఉమాదేవి, ఆది, జయలక్ష్మి, రాజేశ్వరి, నవీన్, పవన్, తదితరులు పాల్గొనారు.




సిబ్బందితో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ గుత్తి ఎడిఎ వెంకటరాముడు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

పార్టీలకతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని రాజాపురం, మార్నేంపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేతోపాటు గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డితో కలిసి ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల అభివద్ధి కోసమే సీఎం జగన్ మోహన్ రెడ్డి నవరత్న పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాండ్లపాటి విశాలాక్షి, ఎంపిటిసి చిన్నవీరన్నగౌడ్, సర్పంచులు ఎ.వెంకటేష్, విజయలక్ష్మి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలాయాదవ్, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు హాజీమలన్‌బాబా, కేశవులు, సూర్యనారాయణరెడ్డి, రాజశేఖర్, కె.మధుసూదన్‌రెడ్డి, వై.సుభాష్‌రెడ్డి, గురుప్రసాద్, ప్రవీణ్‌కుమార్, ఎస్.రాముయాదవ్, హనుమంతు, సోమశేఖర్, రాము, కౌన్సిలర్లు వరదరాజులు, ఫారూక్, వాల్మీకి శివ, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



మొక్క నాటి నీరు పోస్తున్న సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత

మొక్కలను నాటి సంరక్షించాలి

సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత

ప్రజాశక్తి-గుత్తి

మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రత్యేక సబ్‌జైలు, న్యాయస్థానాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్ల పెంపకంతో వర్షాలు బాగా కురుస్తాయన్నారు. చెట్లను కొట్టడం వల్ల వాతావరణ సమతుల్యం లోపిస్తుందన్నారు. ముందుగా సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సబ్‌జైల్ సూపరింటెండెంట్ వడ్డే మహేశ్వరుడు, వైద్యాధికారి విష్ణుమూర్తి, సబ్ రిజిస్ట్రార్ గురునాథ్, న్యాయవాది విసి.గంగాధర్ కుమార్, సిబ్బంది ఎస్.సాదిక్‌వలి, యోగా మాస్టర్ కృష్ణ, గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు విజయభాస్కర్, సుధాకర్‌నాయుడు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



శింగనమలలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు

రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయండి - సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకూ అనంతపురంలో నిర్వహించనున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు అనంతపురంలో నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. ఈ సమావేశాలకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎంఎ బేబీ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ రాజ్యసభ సభ్యులు మధు, మాజీ ఎమ్మెల్సీ గఫూర్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు దిశ, దశ నిర్ణయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, మండల కమిటీ సభ్యులు సి.నాగేంద్ర, నెట్టికంటయ్య, పుల్లయ్య, సంజీవరెడ్డి, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో స్కూటర్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకూ అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 13న జరిగే బహిరంగ సభకు పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎం.ఎ.బేబీ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, మాజీ రాజ్యసభ పి.మధు హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర సమావేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, సుంకన్న, ఎర్రిస్వామి, అంజినేయులు, శ్రీనివాసులు, రమేష్, నల్లప్ప, కుళ్లాయప్ప, మునెప్ప, కేసన్న, పుల్లన్న, నాగరాజు, జయరాములు, సూర్యప్రకాష్, అంజినేయులు, లక్ష్మీనారాయణ, గంపమల్లయ్య, రామాంజనేయులు, కొండారెడ్డి పాల్గొన్నారు.




రాయదుర్గంలో విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

కళ్యాణదుర్గం: సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న ధరలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 13న జరిగే బహిరంగ సభలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు రంగనాథ్, రఘు, ఈశ్వర్, నాగరాజు, వంశీ, బాబా పాల్గొన్నారు.

గార్లదిన్నె: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలుచేయాలని ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయనున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. నేటి నుంచి ప్రారంభం కానున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, రైతుసంఘం నాయకుడు నాగరాజు, రాయుడు, నాగన్న, నాగార్జున, రవి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం: బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రాల్లో ఏకపక్షంగా అమలవుతున్న బిజెపి, వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దామన్నారు. ముఖ్యంగా ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఆయా విధానాలపై చేయనున్న పోరాటాలపై చర్చించేందుకు ఈనెల 12, 13, 14 తేదీల్లో అనంతపురం నగరంలో జరుగనున్న సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలపై భారాలు వేసే విద్యుత్ సంస్కరణలను దేశంలో అందరికంటే ముందుగా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అమలు చేస్తోందని మండిపడ్డారు. తుంగభద్ర డ్యాం నీటికి ప్రమాదకరంగా కర్ణాటకలో నిర్మిస్తున్న ప్రాజెక్టులు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ, కడప ఉక్కు పరిశ్రమ స్థాపనలో నిర్లక్ష్యం, వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధి నిధుల సాధన వంటి అంశాలపై కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఈనెల 13 నిర్వహించనున్న బహిరంగ సభలో పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ సిపిఎం నాయకులు మధు, తిమ్మరాజు, శంకర్, రమేష్, నాగరాజు, అంజి, కృష్ణ నాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్‌ప్రసాద్

ఉరవకొండ: ఈనెల 12, 13, 14 వ తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఈ సమావేశాలకు పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు, ఎంఎ బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, మాజీ పార్లమెంట్ సభ్యులు పి.మధు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను సమీక్షించి భవిష్యత్ కర్తవ్యాలపై కార్యాచరణ రూపొందించుకుని సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం చేసే విధంగా ఈ సమావేశాల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.



రాయదుర్గంలో జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

నేరాలు ఘోరాలు

బావిలో పడి బాలుడు మృతి

గుత్తి: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన పట్టణంలోని కోట ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం గదక్ జిల్లా లక్ష్మేశ్వర గ్రామం పుష్ప, రామచంద్ర దంపతుల కుమారుడు జయరాం (7) గుత్తిలోని కోట ప్రాంతంలో నివాసం ఉండే తన తాత నాగప్ప వద్ద ఉంటూ 2వ తరగతి చదువుతున్నాడు. అయితే సోమవారం సాయంత్రం నుంచి ఆ బాలుడు కనిపించడం లేదు. మంగళవారం ఉదయం బెనకల బావిలో శవమై తేలాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బావిలో ఉన్న చేపలు చూడడానికి వెళ్లి ఆ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



మృతిచెందిన జయరాం

సోదనపల్లి ఎఎన్ఎంకు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎఎన్ఎం పద్మావతి

శింగనమల: మండలంలోని సోదనపల్లిలో ఎఎన్ఎంగా పని చేస్తున్న పద్మావతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఒతో పద్మావతి ప్రశంసాపత్రం తీసుకున్నారు. జనాభా నియంత్రణపై ప్రజల్లో కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలను గుర్తించి ప్రశంసాపత్రం అందజేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ప్రసంసాపత్రాన్ని అందుకుని తరిమెల పిహెచ్‌సికి రావడంతో స్థానిక వైద్యాధికారులు ఫైరోజ్, శంకర్‌నాయక్, సిహెచ్ఒ గంగాధర్, ఎపిహెచ్‌ఒలు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు అభినందించారు.

తక్కల్లపల్లి పాఠశాల తనిఖీ

పుట్లూరు: మండల పరిధిలోని తక్కళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి ఓబుళమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల వాతావరణం మరింత ఆహ్లాదకరంగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలకు ఆటపాటలతో పాటుగా మెరుగైన బోధన అందించాలన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి ఓబుళమ్మ

అన్ని పంటలకూ బీమా అందజేయాలి : సిఐటియు

బొమ్మనహాల్ : రైతులు సాగు చేసే పంటలన్నింటికీ బీమా వర్తింపజేయాలని సిఐటియు కార్యదర్శి ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022లో పంటలు సాగు చేసిన రైతులు దిగుబడి రాక పూర్తిగా నష్టపోయారన్నారు. ముఖ్యంగా పత్తి, మిరప, మొక్కజొన్న, కొర్ర పంటలు పూర్తిగా చేతికందకుండా పోయాయన్నారు. ఆఖరికి ఈక్రాప్ బుకింగ్ చేసినా పంట నష్టపరిహారం అందకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని పంటలకూ పంట నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య సిబ్బందికి సన్మానం

గుత్తి: మండలంలోని బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందిని మంగళవారం ఘనంగా సన్మానించారు. సచివాలయ ఎఎన్ఎంలు సుజాత, శోభ, ఓబులమ్మ, ప్రభావతి, స్టాఫ్ నర్స్ దివ్య భారతి, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీదేవి బదిలీ కావడంతో వైద్యాధికారి దేవేంద్ర నాయక్ ఆధ్వర్యంలో శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది జప్రుల్లా రామకృష్ణ పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

25న రజక విద్యార్థులకు పురస్కారాలు


అనంతపురం కలెక్టరేట్ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో చదువుకుని 2022-23వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన రజక కుటుంబాల విద్యార్థులకు ఈనెల 25న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు రజక ఉద్యోగుల, విద్యావంతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎక్కలూరు రంగనాథ్, గౌరవాధ్యక్షులు పి.కమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.బయన్న తెలిపారు. మంగళవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 మార్చి 10వ తరగతి పరీక్షలలో 500 మార్కుల కంటే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ పరీక్షల్లో సైన్స్‌లో 850 మార్కుల కంటే ఎక్కువ సాధించిన విద్యార్థులు, ఆర్ట్స్ గ్రూప్‌లో 750 మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన రజక విద్యార్థులకు జూలై 25వ తేదిన ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ వెంకటేశులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముదిగల్లు సచివాలయం పరిధిలో 2, దొడగట్ట 2, కన్నేపల్లి 4, మారెంపల్లి సచివాలయంలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 35ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు.

గ్రూప్-2పై ఉచిత అవగాహన సదస్సు

అనంతపురం కలెక్టరేట్ : త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ నోటిఫికేషన్ జారీ చేయనున్న నేపథ్యంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 13న తేజా కోచింగ్ సెంటర్‌లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షల అవగాహన సదస్సును జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలక్రిష్ణ, నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని తేజా కోచింగ్ సెంటర్‌లో అవగాహన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా నోటిఫికేషన్‌లు విడుదల కానున్న నేపథ్యంలో విద్యార్థులు గ్రూప్-2 సిలబస్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 13న నిర్వహించే అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు హాజరుకానున్నారని తెలిపారు. దేశం, రాష్ట్రంలో ఏ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలైన లక్షల సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పోటీపడుతున్నారని తెలిపారు.



గ్రూప్-2 పరీక్షల అవగాహన సదస్సు పోస్టర్లను విడుదల చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

'యువగళం'కు సంఘీభావ యాత్రలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చారిత్రాత్మకమని అనంతపురం అర్బన్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. మంగళవారం కార్యకర్తల కోలాహలం మధ్య అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయం నుంచి మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి సంఘీభావ యాత్ర ప్రారంభించారు. పాదయాత్ర కోర్టు రోడ్డు మీదుగా, టవర్ క్లాక్, ఆర్ట్స్ కళాశాల ఎన్టీఆర్ విగ్రహం వద్ద వరకు పాదయాత్ర సాగింది. వైకుంఠం ప్రభాకర్‌చౌదరి దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆర్ట్స్ కళాశాల ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా ఇప్పటికీ రెండు వేల కిలోమీటర్లు పూర్తయిందని, ఉమ్మడి రాష్ట్రాల్లో ఎవరూ చేయని సుదీర్ఘ పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా టిడిపి విధానాలను చాటి చెబుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పాదయాత్ర సాగుతోందన్నారు. ఇది సాహసోపేతమైన చర్యగా అభివర్ణించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఎత్తిచూపుతూ పాదయాత్ర ముందుకు సాగుతోందనీ, ప్రజలు ఎక్కడికి వెళ్లిన బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర శుక్ర, శని, ఆదివారాలు సెలవు దినాలుగా సాగిందని, ప్రస్తుతం నారా లోకేష్ పాదయాత్ర సుదీర్ఘంగా సాగుతోందన్నారు. ప్రజలకు సక్రమంగా పథకాలు అందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, ధనిక, పేదల మధ్య వ్యత్యాసాలు పోవాలంటే ఒక్క టిడిపితోనే సాధ్యమవుతుందన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. ఈ నాలుగున్నర సంవత్సరాల సైకో పాలలో ప్రజలు విసిగిపోయారని, అన్ని రకాల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని, పేద, బడుగు మధ్యతరగతి ప్రజలు జీవించాలంటే కష్టంగా మారిందని, ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తామని, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. టిడిపి జిల్లా పరిశీలకులు రమణారెడ్డి మాట్లాడుతూ సైకో ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని, సైకిల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆ పార్టీ కార్యకర్తల ఉత్సాహం, కోలాహల నడుమ సంఘీభావయాత్ర విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సాలార్‌బాషా, శ్రీధర్‌చౌదరి, గౌస్ మొయిద్దీన్, గంపన్న, బాంబే డయింగ్ నాగన్న, నగర అధ్యక్షులు మారుతీకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

రాయదుర్గం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 2000 కిలోమీటర్ల మైలురాయి దాటిన సందర్భంగా మంగళవారం పట్టణంలో మద్దతు బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం నుంచి వినాయక సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడే ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు మాట్లాడుతూ జనవరి 27న కుప్పంలో ప్రారంభమైన లోకేష్ యువగళం పాదయాత్ర 153వ రోజున 2 వేల కిలోమీటర్ల పూర్తి చేసుకోవడం సంతోషకరమన్నారు. జన ప్రభంజనాన్ని తలపిస్తూ రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, బిసి సెల్ అధ్యక్షుడు తిప్పయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు ఇనాయత్, సన్నన్న, నాగరాజు, తిప్పేస్వామి, సోము, ఎస్సీ సెల్ మల్లి, తిప్పేస్వామి, రవి, శీనా, రామంజి, తిప్పేస్వామి, యల్లప్ప, రాజశేఖర్, శంకర్, అంజి, తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

'పవన్' ప్రశ్నలకు సమాధానం చెప్పలేని ప్రభుత్వం

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్


ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో నాలుగేళ్లలో కనబడకుండా పోయిన 29 వేల మంది మహిళలతోపాటు శాంతిభద్రతలు లోపించాయని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతోందని జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. అంతే గాకుండా మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. వాలంటీర్ వ్యవస్థలో కొంతమంది చేస్తున్న దుర్మార్గాలను ప్రశ్నిస్తే ఉలుకెందుకు అని ప్రశ్నించారు. దళిత మహిళా యువతులపై అత్యాచారాలు చేసిన వాలంటీర్లు.. పెన్షన్ సొమ్ముతో ఉడాయించడం, ఎర్రచందనం, మద్యం రవాణా చేసిన వాలంటీర్లు లేరా అని నిలదీశారు. శింగనమల మండలంలో ముగ్గురు వాలంటీర్లు కలిసి ఓ బాలికను ఎత్తుకెళ్లిన సంఘటనలో ఫోక్సో కేసు నమోదు కాలేదా.. అన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-బెలుగుప్ప

కొద్దిరోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మృతిచెందిన మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన రైతు ఈశ్వర్‌రెడ్డి భార్య సువర్ణమ్మ కుటుంబ సభ్యులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఓబులేసు మాట్లాడుతూ ట్రాక్టర్ ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరూ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.8 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. దీంతో సంబంధిత చెక్కును బాధితుల కుమారునికి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిటిసిల జిల్లా అధ్యక్షుడు ఎంపిపి పెద్దన్న, జెడ్పిటిసి భర్త త్రిలోకనాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు అధ్యక్షుడు శివలింగప్ప, నాయకులు దుద్దేకుంట రామాంజనేయులు, నక్కలపల్లి రామిరెడ్డి, శ్రీనివాసులు, నక్కలపల్లి, భాస్కర్‌రెడ్డి, నరుగన్న రమేశ్వర్‌రెడ్డి, హనుమంతురాయుడు, పంచాయతీ సెక్రటరీ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న నాయకులు, అధికారులు

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ట్రస్టు ఛైర్‌ఫర్సన్ నిర్మలామురళి మంగళవారం అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు గౌరీ పుట్టినరోజు సందర్భంగా ఆమె సహకారంతో అన్నదానం చేసినట్లు నిర్మలామురళి తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వస్తున్న రోగులకు, రోగుల బంధువులకు ఆకలి తీర్చడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవిన్, ఆదిత్య, సౌధామని, సుబ్రమణ్యం, నబిరసూల్, కిష్టప్ప, సుబ్బారావు, బాలరాజు, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌ఫర్సన్ నిర్మలామురళి

జనాభా నియంత్రణకు పాటుపడదాం..

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీలో వక్తలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని బి.యాలేరు గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు ముద్దు.. ముగ్గురు వద్దు.. అధిక జనాభా.. అనర్థాలకు మూలం.. చిన్న కుటుంబం చింత లేని కుటుంబం.. బిడ్డకూ బిడ్డకు మధ్య ఎడం.. తల్లీబిడ్డల ఆరోగ్యం.. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించండి.. జనాభాను నియంత్రించండి.. అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సబీహాసుల్తానా, ఎంపిహెచ్ ఇఒ నాగేశ్వరయ్య, మునాఫ్, సిహెచ్ఒ షమీమ్ తారా, పిహెచ్ ఎన్.తులసమ్మ, సూపర్‌వైజరు వెంకటరత్నమ్మ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

ఉరవకొండ : పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యాధికారిణి పావని ఆధ్వర్యంలో జనాభా పెరుగుదలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి పావని మాట్లాడుతూ అధిక జనాభా అనర్థాలకు మూలమన్నారు. నిరుద్యోగం, పేదరికం లాంటి ఎన్నో సమస్యలకు కారణం అవుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ హైస్కూల్ నుంచి గ్రామంలోని పురవీధుల గుండా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ ,హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ ఎఎన్ఎం పద్మావతి, సిఒ భగవాన్‌దాస్, ఆఫీస్ సబార్డినెట్ గౌస్‌పీర్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

గార్లదిన్నె: చిన్న కుటుంబంతో చింతలేని జీవతం గడపవచ్చని డాక్టర్ షమీం తాజ్ తెలిపారు. జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు గౌతమి, దిలీప్‌కుమార్, పిహెచ్ఎన్ అరుణకుమారి, సూపర్‌వైజర్లు ఇందిరమ్మ, విశ్వనాథరావు, సచివాలయ సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్థికశాస్త్ర, గ్రామీణ అభివృద్ధి విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ దేశ జనాభా ప్రస్తుతం 142 కోట్లు ఉందన్నారు. ఇది చాలా ప్రమాదకరం అన్నారు. జనాభాకు అనుగుణంగా అవసరాలను తీర్చడం భారమవుతుందన్నారు. భవిష్యత్తులో వనరులు తగ్గిపోయి ఆహార, నిరుద్యోగ, వాతావరణ కాలుష్య, ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమై అనేక ఇబ్బందులకు దారి తీస్తాయన్నారు. జనాభాని తగ్గించుకోవడానికి మనలోని మూఢనమ్మకాలను వదిలివేసి పరిమితమైన కుటుంబాలకి దోహదం చేసే విధంగా ప్రతిఒక్కరూ చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, జాతీయ సేవా పథక ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, రామకృష్ణ, గోవర్ధన్, అధ్యాపకులు దేవదాస్, రఘు, మల్లికార్జున, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



కుందుర్పిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కుందుర్పి : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ ఇప్పటికే భారతదేశ జనాభా 152 కోట్లకు చేరుకుని ప్రపంచంలో అధిక జనాభా కలిగిన దేశంగా పేరొందిందన్నారు. రాబోవు కాలంలో వానరాల కంటే జనాభా అధికమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కావున ఒక్కరు ముద్దు, ఇద్దరు వద్దు.. అనే నినాదంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూషాదేవి, డాక్టర్ చాంద్‌బేగం, డాక్టర్ సోమేశ్‌కుమార్, సిహెచ్ఒ ముంతాజ్ బేగం, పిహెచ్ఎన్ శశికళ, సూపర్‌వైజర్లు నరసింహారావు, ప్రకాష్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌లో రాజకీయ నైరాశ్యం



అనంతపురంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లో రాజకీయ నైరాశ్యం కనపడుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని వేణుగోపాల్‌నగర్, రామ్‌నగర్, బుడ్డప్పనగర్‌లో 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ మాటలు, చేష్టలు రెచ్చగొట్టేలా ఉన్నాయన్నారు. ప్రజల్లో జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక మూర్ఖుడిలా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ప్రభుత్వం తరపున ప్రజల కోసం వాలంటీర్లు నిస్వార్థంగా పని చేస్తున్నారని, అలాంటి వారిని హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారంటూ వ్యాఖ్యానించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఆర్‌డి పీవీవీఎస్ మూర్తి, కమిషనర్ భాగ్యలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, మాజీ మేయర్ రాగే పరుశురాం, జెసిఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, వైసిపి బీసీ విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు నాగమణి, సుజాత, లీలావతి, జయమ్మ, సైపుల్లాబేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, రమణ, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, గృహసారథులు, డివిజన్ కన్వీనర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రజా సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచి రామాంజనేయులు, పంచాయతీ సెక్రటరీ రమణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నముష్టూర్ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ తేజోనాథ్, మాజీ మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సుంకన్న, మండల అగ్రి అడ్వైజరీ ఛైర్మన్ వెంకటేసులు, సచివాలయ కన్వీనర్లు వంకాయల గోవిందు, లాలుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండలంలోని దుగ్గుమర్రి, నార్పల-4 సచివాలయాల పరిధిలో ఆయా సర్పంచులు మన్నీల సుప్రియ, శివలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు అవసరమైన ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ, మండల ఉపాధ్యక్షులు వెంకటలక్ష్మమ్మ, దుగ్గుమర్రి ఎంపిటిసి శారదమ్మ, నార్పల పంచాయతీ ఉపసర్పంచి గవ్వల శ్రీరాములు, తహశీల్దార్ సురేష్‌బాబు, ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి జి.లక్ష్మీనరసింహా, సిఎస్‌డిటి రాజశేఖర్, ఆర్‌ఐ జ్యోతిరాణి, పంచాయతీ కార్యదర్శులు అశ్వర్థమనాయుడు, మల్లికార్జున, విఆర్‌ఒలు లక్ష్మన్న, నాగరాజు, సచివాలయ సిబ్బంది ఉషారాణి, బాబు, రామ్కీ, సాయిశారద, ఆల్ ఫోన్ససా పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



బుక్కరాయసముద్రంలో లబ్ధిదారురాలికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు, నాయకులు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని 4వ సచివాలయం, దండువారిపల్లి సచివాలయం ప్రాంగణంలో సర్పంచులు సర్పంచ్ పార్వతి, బండి రేణుక అధ్యక్షతన మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ విజయభాస్కర్, జడ్పీటీసీ నీలం భాస్కర్, ఎంపీటీసీలు కాలవ వెంకటలక్ష్మి, శిరీజా, ఇఒఆర్‌డి దామోదరమ్మ, వ్యవసాయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఎపిఎం మద్దిలేటి, ఎపిఒ పోలేరయ్య, ఆలూరు రమణారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ భయపరెడ్డి, పురుషోత్తం, చికెన్ నారాయణస్వామి, పంచాయతీ కార్యదర్శి సాదిక్‌వలి, సాకే లక్ష్మీనారాయణ, రాజారెడ్డి, కుళ్లాయప్ప, కొండమ్మ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని 12, 14వ సచివాలయాలకు సంబంధించి స్థానిక కోట మారెమ్మ గుడి ఆవరణలో, 13, 15వ సచివాలయాలకు సంబంధించి నిమ్మకాయల మసీదు వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాళుశిల్ప మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే దేశంలో ఎక్కడా లేనివిధంగా సిఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్, ప్రత్యేకాధికారి నాగరాజు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వార్డు కౌన్సిలర్లు పద్మజ, పెద్దవన్నూరప్ప, లుబ్న గజాల, డిష్ గోవిందు, సంజీవప్ప, ఫక్రుద్దీన్, పోరాళు గోవిందరాజులు, షబ్బీర్, కో ఆప్షన్ సభ్యులు నజీర్, శ్రీనివాసులు, వార్డు ఇన్‌ఛార్జి పోరాళుశివ, అరవ శివప్ప, గంగాధర్, బషీర్, ఇస్మాయిల్, వాలంటీర్లు పాల్గొన్నారు.

పుట్లూరు : జగనన్న సురక్ష బృహుత్తరమైన కార్యక్రమని ప్రత్యేకాధికారిణి ఓబుళమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తక్కల్లపల్లి, ఎస్‌గూడూరు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ యోగానందరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తక్కలపల్లి గ్రామ సచివాలయం పరిధిలో 114 మందికి, శనగలగూడూరు సచివాలయం పరిధిలో 275 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, మల్లేష్‌ప్రసాద్, ఎఒ కాత్యాయని, ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, ఎంఇఒ శ్రీదేవి, అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి కమలా నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కరిగానపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ ఇ.రాము, తహశీల్దార్ విజయ్‌కుమారి, ఎంఎల్‌ఒ భరత్, గ్రామ సచివాలయ కన్వీనర్లు వెంకటేష్, లోకేష్, తిప్పేస్వామి, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : జగనన్న సురక్ష పథకంలో భాగంగా 13 సచివాలయాల్లో దోసలుడికి సచివాలయం టాప్-గా నిలిచిందని ఎంపిడిఒ వెంకటరావు తెలిపారు. మంగళవారం మండలంలోని వెంకటాంపల్లి, దోసలుడికి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దోసలుడికి గ్రామం సచివాలయం పరిధిలో 687 మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని ఆవులదట్ల, చదం గొల్లలదొడ్డి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి వరప్రసాద్ హాజరై 98 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండలం నోడల్ అధికారి నాగరాజు, ఎంపిపి విద్యావతి, ఎంపిడిఒ కొండయ్య, తహశీల్దార్ మారుతి, డిప్యూటీ తహశీల్దార్ సురేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.





నార్పల, గుంతకల్లు మండలాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు



రాయదుర్గం రూరల్ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న నాయకులు, అధికారులు

రైతు సంక్షేమమే జగనన్న లక్ష్యం : ఎంపిపి

ప్రజాశక్తి-కుందుర్పి

రైతు సంక్షేమమే సిఎం జగనన్న లక్ష్యమని ఎంపిపి కమల నాగరాజు అన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా బీటీ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతన్నలకు నష్టపరిహారం అందించేందుకు నిధులు విడుదల చేయడం పట్ల సిఎం జగన్, మంత్రి ఉషశ్రీచరణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ చెప్పిన మాట మేరకు మొదటి విడత కింద రైతన్న ఖాతాల్లోకి రూ.132 కోట్ల నిధులు విడుదల చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, జడ్పిటిసి రాధాస్వామి, జెసిఎస్ మండల కన్వీనర్ రాము, సుదర్శన్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ వన్నూరురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ భవన స్థలానికి సంబంధించిన పట్టాను అందజేస్తున్న విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతికి సిఎం జగన్ ఎనలేని కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఉరవకొండ నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహంచారు. అంతకుముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చాక నాయీ బ్రాహ్మణ కులానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా సంక్షేమ పథకాల్లోనూ అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించాలని జగన్ ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. అంతేకాక నాయీబ్రాహ్మణులను సంబోధించే కొన్ని పదాలను వాడుకలో నుంచి తొలగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల కారణంగా వారి ఆత్మగౌరవం పెరిగిందని చెప్పారు. అంతేకుముందు నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఉరవకొండ మేజర్ పంచాయతీ తరపున 20 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు బుసన్న గారి మల్లికార్జున, సర్పంచి లలిత, ఉపసర్పంచి వన్నప్ప, కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, మాజీ ఎంపిపి ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, ఎంపిటిసి వన్నూరుసాబ్, కో ఆప్షన్ నెంబర్ సలీం, నాయీ బ్రాహ్మణ కుల సంఘం గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు భీమరాజు, ఉపాధ్యక్షుడు హనుమంతు, సెక్రటరీ కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ రవిశంకర్, ట్రెజరర్ సుభాష్, కమిటీ సభ్యులు పామిడి రవీంద్ర, నాగరాజు, గడ్డం మల్లికార్జున, ఎంసీ నారాయనప్ప, పామిడి కిషోర్, ప్రకాష్, పామిడి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.